# మాస్టర్ ప్లాన్

ఒక చిన్న పంచాయతీలోని గ్రామీణ బ్యాంకులో ముగ్గురే సిబ్బంది. మేనేజరు, ఎకౌంటెంటు, క్యాషియరు, సుమారు ఐదారుగురు ఖాతాదార్లు తమ లావాదేవీలు జరుపుకుంటున్నారు.

హఠాత్తుగా ఆ ఖాతాదారుల్లో ఇద్దరు తమ హ్యాండ్ బ్యాగుల్లోని బాకులు తీసి - "హాండ్సప్! ఎక్కడ వాళ్లు అక్కడే ఉండండి! కదిలేరంటే పొడిచెస్తాము!" అంటూ అందులో ఒకడు బ్యాంకు తలుపులు మూసేశాడు.

బ్యాంకు సిబ్బంది, మిగిలిన ఖాతాదారులు నిశ్చేష్టులయిపోయారు! తామెప్పుడూ ఇటువంటటి చేదు అనుభవాన్ని చవిచూడలేదు.

ఆ బందిపోట్లు క్యాషియర్ని ఉద్దేశించి - "ఆ క్యాష్ ఇందులో పెట్టు. లేకపోతే చూసుకో!" అంటూ ఓ పోటు పొడిచాడు. క్యాషియర్ నెత్తుటితో నేల కొరిగాడు. మేనేజరు, ఎకౌంటెటు ఏం చేయాలో తోచక చేతులెత్తేశారు. బందిపోట్లలో ఒకడు కౌంటర్లోని నోట్ల కట్టలు అంకించుకుని తన హాండ్ బాగ్‌లో పెట్టుకున్నాడు. ఇద్దరు బందిపోట్లూ తలుపులు తీసుకుని పారిపోబోయారు.

వాళ్లు బయట అడుగు పెట్టేరో లేదో, బయట నుండి ఇంకొక వ్యక్తి, గాలిలోకి పిస్తోలు పేలుస్తూ-"ఖబడ్దార్! కదిలేరంటే కాల్చేస్తాను!" అన్నాడు.

ఆ బందిపోట్లిద్దరూ క్యాష్‌బాగ్ పారేసి చేతులెత్తేశారు.

"మేనేజర్‌గారూ! బయటికొచ్చి వీళ్లని పట్టుకోండి!" అని అరిచేడు పిస్తోలు పట్టుకున్న వ్యక్తి.

మేనేజరూ, మిగిలిన ఖాతాదార్లూ గబగబా వచ్చి ఆ బందిపోట్లని పట్టుకుని, ఆ బ్యాంకులోని స్టాక్‌రూమ్‌లో బంధించేసి, ఆ గ్రామాల పరిధిలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కి కబురు పెట్టేరు.

ఈ వార్త విని పొరుగూళ్ల నుండి జనం తండోప తండాలుగా వచ్చేశారు. బాకు పోట్లకు గురైన క్యాషియర్ని అర్జంటుగా రెండెడ్ల బండిలో ప్రాథమిక చికిత్సా కేంద్రానికి తరలించారు. క్యాషియర్ పరిస్థితి ప్రమాదం లేదని డాక్టరూ, సిబ్బందీ చెప్పేరు.

పోలీసులు జీపులో వచ్చి బందిపోట్లని అరెస్టు చేశారు.

ఈ వార్త పత్రికల ద్వారా పాకిపోయింది. "ఫలానా వ్యక్తి బ్యాంకు దోపిడీని అరికట్టేడు!" అని పతాక శీర్షికలు. ఆ సాహసవీరుని ఫోటోలు!

"మీరు బ్యాంకు దోపిడీని అరికట్టడం మెచ్చుకోతగినదే! దానికి అవార్డూ రివార్డూ ఉంటాయి. కాని, మీకు పిస్తోలు లైసెన్సు లేకపోతే, లైసెన్స్ లేని ఆయుధం కలిగి ఉన్నందుకు మీ మీద కేసు పెట్టాల్సుంటుంది" అన్నారు ఎస్సైగారు.

"అయ్యా! ఇదిగో పిస్తోలు. ఇవిగో గుళ్లు. ఇది నాటకాల్లో వాడే పిస్తోలు. దీనికి లైసెన్సు అవసరం లేదు. మా నాటక సమాజం పేరు 'విజేత నటసమాఖ్య', తమరు దర్యాప్తు చేసుకోవచ్చు. నేనొక నిరుద్యోగ పట్టభద్రుణ్ణి. పేరు పన్నగభూషణం ఎం.ఏ.ఎం.ఇడి."

ఎస్సైగారు అన్నీ సమగ్రంగా దర్యాప్తు చేసి, నిజం తెల్సుకుని, ఆ నిరుద్యోగ పట్టభద్రునికి టీచర్‌గా ఉద్యోగం వేయించమని, పై అధికార్లకి బ్యాంకు అధికారుల ద్వారా సిఫార్సు చేశారు.

ఇప్పుడా నిరుద్యోగ పట్టభద్రుని స్వగతం:

'నాకు ఉద్యోగం దొరక్క విసిగి వేసారి, ఏవో నాటక సమాజాల్లో తిరుగుతూ కాలం గడుపుతున్నాను. ఈ నాటకం పిస్తోలుతోనే, ముసుగు వేసుకుని, బ్యాంకులో దూరి, సిబ్బందిని బెదిరించి, క్యాష్ దోచుకోవాలని మాస్టర్ ప్లాను వేశాను. నే దోచుకుందామనుకున్న డబ్బుని ఇంకరు దోచుకుపోతుంటే సహించలేక, వాళ్లని పట్టుకున్నాను. నా పథకం అంతా తారుమారై, ఉద్యోగం వచ్చి సద్యోగం పట్టింది!'

**ఆంధ్రప్రభ వీక్లీ 3-7-96**